క్లుప్తంగా

మార్కెట్లకు క్రిస్మస్ కళ


క్రిస్మస్ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

కంచరపాలెం: క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. జ్ఞానాపురం, కంచరపాలెం, ఊర్వశి కూడలి, తాటిచెట్ల పాలెం, మర్రిపాలెం, ఎన్‌ఏడీ కూడలి తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. పలు రకాల రంగులు, ఆకారాల్లో నక్షత్రాలు (స్టార్స్), క్రిస్మస్ ట్రీస్, గంటలు, బెలూన్లు, శాంతాక్లాజ్ దుస్తులు, పశువులపాకల సెట్లు, విద్యుత్ దీపాలు ఇలా అనేక రకాల వస్తువులు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఉత్సాహం చూపుతున్నారు.

జనతాకాలనీలో 'వికసిత భారత్'


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు విజయ్‌బాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీ వద్ద బీజేపీ నాయకుడు కె.విజయ్‌బాబు ఆధ్వర్యంలో వికసిత భారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు, ఆ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో పార్టీ ఎస్సీ మోర్చా నాయకుడు కె.విజయ్‌బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ చిరంజీవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ ఐక్య సమావేశానికి ఆహ్వానాలు


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: ఈ నెల 24వ తేదీన 88వ వార్డు నరవ గ్రామం, శివాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరగనున్న పశ్చిమ పరిధిలోని యాదవుల సమావేశానికి సంబంధించి శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు పారిశ్రామిక ప్రాంతంలో యాదవ సంఘాల ప్రతినిధులకు ఆహ్వాన పత్రాలను గురువారం అందించారు. సంఘం ప్రతినిధులు ముందుగా మల్కాపురం, యాదవ వీధి, ప్రకాష్‌నగర్, వెంకన్నపాలెం, శ్రీహరిపురం, నక్కవానిపాలెం, హిమచల్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లి ఆయా ప్రాంతాల యాదవ సంఘాల ప్రతినిధులకు ఆహ్వానాలను అందించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకోవాలి


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం జ్ఞానాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్డులను ప్రతి ఆస్పత్రి తప్పనిసరిగా స్వీకరించి రోగులకు వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో అట్టహాసంగా జరిగాయి. పేదులకు చీరల పంపిణీతో పాటు వివిధ సేవా కార్యక్రమాలతో వైఎస్సార్ సీపీ నేతలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. వాడవాడలా ఈ వేడుకలు అంబరాన్నంటాయి. పార్టీ ముఖ్యులంతా వేడుకలు నిర్వహించారు

- వాడవాడలా సీఎం జగన్ జన్మదినోత్సవం
- పలు సేవా కార్యక్రమాల నిర్వహణ


40వ వార్డులో చిన్నారులతో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

మల్కాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పారిశ్రామిక ప్రాంతంలో పలు వార్డుల్లో గురువారం ఘనంగా నిర్వాహించారు. దీనిలో భాగంగా 58వ వార్డు పిలకవానిపాలెంలో జరిగిన జన్మదిన వేడుకలు పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు (పాడుగు రాజు)ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం పలువురు పేదలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశ్చిమ క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, ఎసీఎస్ కన్వీనర్ పల్లా కన్నబాబు, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, తొనంగి వెంకటరమణి యాదవ్, ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి, చిన్న సత్యనారాయణరెడ్డి, పిలక సూర్యప్రసాద్‌రెడ్డి, పిలక ఈశ్వర్‌రెడ్డి, పెద్దింటి భాస్కరరావు, ముకుందరావు, సత్యవతి పాల్గొన్నారు. అలాగే ఇదే వార్డు శ్రీహరిపురం, జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పాల్గొని కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. 61వ వార్డు మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జ్ పిలక రామ్మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, వార్డు పార్టీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు, ఎస్వీ రమణ, బూస అప్పలరెడ్డి, సోనూ, దాడి సత్యనారాయణ, చట్టి నూకరాజుయాదవ్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు. 60వ వార్డు అశోక్‌నగర్ వద్ద పార్టీ నగర కార్యదర్శి శరగడం పత్నిరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో రోగులకు పత్నిరావు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు స్వీట్సు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామాక్షి, సుబ్బలక్ష్మి, ఉమా, కనకమహాలక్ష్మి, రాజశ్రీ పాల్గొన్నారు.

దివ్యాంగుల మధ్య ...


దివ్యాంగులతో కేక్ కట్ చేయిస్తున్న వినీత

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను 90వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ కొనాల వినీత ఆధ్వర్యంలో గురువారం శాంతి ఆశ్రమంలో దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంచారు. అదేవిధంగా పెన్నులు, పుస్తకాలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను గెలిపించుకోవడం ద్వారా మరోమారు రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అర్జున్, కేఎస్ రెడ్డి, మహిళా నాయకులు భాను, పాఠశాల కరస్పాండెంట్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సర్వమత ప్రార్థనలు

సింధియా: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరిగాయి. జనహృదయనేత జగన్ మోహన్‌రెడ్డి కోసం కార్యకర్తలు సర్వమత ప్రార్థనలు చేసి, ప్రజానేత నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్‌కాలనీలో ఆ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రెహమాన్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, అనంతరం సుమారు 200 మంది వృద్ధులకు దుప్పట్లు, చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్స్, స్వీట్లు పంపిణీ చేశారు.


రోగులకు పండ్లు పంచుతున్న పత్నిరావు

కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు నిలువెత్తు నిదర్శనం

విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికీకరణ, ప్రజల ముంగిటకే అందించి సంక్షేమ పాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మనసారా ఆశీర్వదిస్తున్నారని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు వార్డు పరిధిలోని దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, త్రినాథపురం తదితర ప్రాంతాల్లో సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్డు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. గుడివాడ అప్పన్నకాలనీలోని స్వర్గీయ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన ఆశయాలను నేరవేర్చుతున్న సీఎం జగన్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు భీశెట్టి గణేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

సింధియా: సీఎం జగన్ జన్మదినం సందర్భంగా జీవీఎంసీ 40వ వార్డులో ఉన్న ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, షిప్‌యార్డ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుగుణవతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం


కేక్ కట్ చేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: సంక్షేమ పాలన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పార్టీ నాయకులు, అభిమానులు, సచివాలయ ఉద్యోగుల సమక్షంలో కేక్ కేట్ చేసి, అందరికీ మిఠాయిలు పంచారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే ఉన్నతాశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పాలనలో సీఎం జగన్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, పార్టీ నాయకులు జియ్యాని మారుతి, జియ్యాని విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేద పండితులకు సత్కారం


కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారి సింధు తదితరులు

మల్కాపురం: బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం) వారి ఆధ్వర్యంలో జ్ఞాన భక్తి సంగమం కార్యక్రమంలో భాగంగా పారిశ్రామిక ప్రాంత పరిధి పలువురు వేద పండితులను సత్కరించారు. శ్రీహరిపురంలో సంస్థ నిర్వాహకులు సింధు మాట్లాడుతూ జ్ఞానభక్తి సంగమం కార్యక్రమంలో భాగంగా హిందూధర్మ పరరక్షణకు తమ వంతు సహకారం అందుస్తున్న పండితులను, అలాగే ఆలయాల్లో దేవుడ్ని స్మరిస్తు, భక్తులకు జ్ఞాన బోధనలను అందిస్తున్న వారిని నేడు సత్కరించినట్టు చెప్పారు. వేదికపై ఇంత మంది పండితులను సత్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధి భోగవళి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోండి


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో దివాకర్, హెచ్‌ఎం కోటేశ్వరరావు తదితరులు

గోపాలపట్నం: ప్రభుత్వం సమకూర్చిన బైజూస్ లోడెడ్ టాబ్‌లను హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంఈవో దివాకర్ గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను డిజిటలైజేషన్ చేసి విద్యావ్యవస్థను ఉన్నతంగా తీర్చి దిద్దుతున్నారని వాటిని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని అన్నారు. అత్యంత విలువైన ట్యాబ్‌లు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. వీటిని దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. వీటి ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల చదువులను పర్యవేక్షించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 8వ తరగతి విద్యర్థులు 51 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. ఈ పాఠశాలకు డిజటల్ ఎల్‌ఈడీలు వచ్చాయని వాటిని తరగతి గదుల్లో ఏర్పాటు చేశామన్నారు. గతంలో కంటే మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాస రెడ్డి, కంపర కోటేశ్వరరావు, కంపర సత్తిబాబు, బి నాగేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతున్న చర్చిలు


సెయింట్ థామస్ చర్చ్


యునైటెడ్ క్రైస్ట్ చర్చ్

విశాఖ విద్య: ఎస్‌ఏడీ ఏరియాలో క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. ఈ నెల 25న క్రిస్మస్‌ను వేడుకగా జరుపుకునేందుకు క్రైస్తవ సోదరులు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. క్రిస్మస్ పండగ నేపథ్యంలో మూడు రోజుల పాటు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ఇందుకోసమని చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఎస్‌ఏడీ ఏరియాలో సెయింట్ థామస్ చర్చి, ఫ్లైఓవర్ పక్కన ఉన్న యునైటెడ్ క్రైస్ట్ చర్చ్‌లకు విద్యుత్ దీపాలను అమర్చారు. దీంతో క్రైస్తవ దేవాలయాలు ఎంతో ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: విశ్వశాంతిని నెలకొల్పేందుకు ఏసు క్రీస్తు ఉద్భవించాడని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 91వ వార్డు స్టీఫెన్ పాల్ చర్చ్ వద్ద నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వారికి ఎపుడూ మంచి చేసే దేవుడు క్రీస్తు అని అన్నారు. క్రీస్తు సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ షాలాపాల్, పాస్టర్ శ్యామల రాజ్, బండి దుర్గేష్, టి రమేష్, సత్యకళ, కృపామణి, తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

అట్టహాసంగా క్రికెట్ పోటీలు

ప్రారంభించిన ఆడారి ఆనంద్ కుమార్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఏ రహమాన్



జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన జగనన్న విశాఖ పశ్చిమ క్రికెట్ లీగ్ పోటీలు గురువారం కిత్తపాలెం చంద్రనగర్ గ్రౌండ్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆడారి ఆనంద్ కుమార్ పోటీలను ప్రారంభించారు. అనంతరం జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులను ఆనంద్‌కుమార్, పశ్చిమ పరిశీలకుడు రెహమాన్ పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు క్రికెట్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు మేలు చేకూర్చే విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో ఓ వైపు సంక్షేమం, అభివృద్ధితో కళకళలాడుతోందన్నారు. క్రికెట్ పోటీలు జనవరి 7 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం తొలి రోజు మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్ బాచి లెవన్స్ వెర్సస్ ఆదర్శనగర్ జట్ల మధ్య సాగింది. ఈ మ్యాచ్‌లో బాచి లెవెన్స్ గెలుపొందింది. ఆదర్శనగర్ జట్టు 12 ఓవర్లకు 102 పరుగుల చేసి 9 వికెట్లు కోల్పోయింది. బాచి లెవెన్స్ 7 ఓవర్లలో 103 పరుగులు చేసి విజయం సాధించింది. 50 పరగులు చేసిన ఆడారి అరవింద్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. మొత్తంగా 56 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. శుక్రవారం నుంచి రోజుకు మూడు మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు పీవీ సురేష్, ముర్రు వాణి, మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీకృష్ణ, బీఎస్ కృష్ణ, నమ్మి వెంకట కృష్ణమూర్తి యాదవ్, చుక్క ప్రసాదరెడ్డి, అంగా రామ్‌ప్రసాద్, మోదాతుల సురేష్, శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.


పోటీ పడుతున్న బాచి లెవన్స్ వెర్సస్ ఆదర్శనగర్ జట్లు

అమ్మ సన్నిధి.. భక్తజన పెన్నిధి


ఈవో శీరిషకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు.. విశాఖ వాసుల ఆరాధ్యదైవం సిరులతల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణాలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం, విశేష పూజలు చేశారు. బుధవారం అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కనకమహాలక్ష్మికి పట్టు వస్త్రాల అందజేత

మార్గశిర మాసోత్సవాలు పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేసింది. ఆలయ సంప్రదాయం ప్రకారం టీటీడీ ప్రతినిధులకు స్వాగతం పలికి.. వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు.

దేశానికి దిక్సూచి సీఎం జగన్ పాలన


ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: దేశానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దిక్సూచిగా మారిందని, ఇతర రాష్ట్రాలు రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అనుసరిస్తున్నాయని 62వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో దుర్గానగర్ సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికి తిరుగుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్లను, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక కష్టాలను అనుభవించారని, జగన్ సీఎం అయ్యాక ప్రజలు సంక్షేమ పథకాలతో సుభిక్షంగా ఉన్నారన్నారు. అందుకే ప్రజలంతా తిరిగి జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు నక్కా సూర్యనారాయణ, భారతి, రామకృష్ణ, వార్డు వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బయోకెమిస్ట్రీలో స్మారకోపన్యాసం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య టి.ఎం.రాధాకృష్ణ-టి.ఎం.భారతిల స్మారకోపన్యాసాన్ని 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ డెవలప్‌మెంట్స్ ఇన్ బయోకెమిస్ట్రీ'అంశంపై గురువారం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(బెంగళూరు) పూర్వ సంచాలకులు, నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ చైర్ ప్రొఫెసర్ పద్మభూషన్ అవార్డు గ్రహీత ఆచార్య పి.బలరామ్ 'ది ఎవల్యూషన్ ఆఫ్ బయోకెమిస్ట్రీ అండ్ ద బర్త్ ఆఫ్ బయాలజీ'అంశంపై కీలకోపన్యాసం చేశారు. ముందుగా ఆచార్య టి.ఎం.రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య పి.బలరామ్ భారతి, రసాయన శాస్త్రాలు, జియాలజీ, బయోకెమిస్ట్రీ, బయాలజీలు ఆవిర్భావం, ప్రగతిని వివరిస్తూ వాటి ప్రాధాన్యతను వివిధ ఉదాహరణలతో వివరించారు.

యువకుడి బలవన్మరణం


మృతుడు భగవాన్

గోపాలపట్నం: మనస్తాపంతో యువకుడు గొల్లపల్లి భగవాన్ (21) బలవన్మరణానికి పాల్పడిన ఘటన మర్రిపాలెం హుస్సేన్‌నగర్లో గురువారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపాలెం హుస్సేన్ నగర్‌లో అక్క లక్ష్మి ఇంట్లో భగవాన్ ఉంటున్నాడు. కృష్ణా కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి భగవాన్ గురువారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. భగవాన్ వచ్చిన తరువాత అక్క బయటకు వెళ్లడంతో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటికి స్థానికులు గుర్తించి లక్ష్మికి తెలియజేశారు. అనంతరం 108కు సమాచారమివ్వడంతో సిబ్బంది వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులకు తెలియపరచగా ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. గతంలో భగవాన్ మావయ్య రూ.12 వేలు ఉంచమని ఇచ్చాడు. అయితే ఆ నగదు ఖర్చు చేయడంతో మావయ్యకు ఏం సమాధానం చెప్పాలో తెలియక మనస్తాపంతో ఉరి వేసుకున్నట్టు తెలుస్తోంది. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.